# చాచిన చేతులు

-కె.వాసవదత్త రమణ

"రాధాక్రిష్ణను దీవించి నాన్న వ్రాయునది. ఇక్కడంతా క్షేమం. అక్కడ మీరు క్షేమమని తలుస్తాను. మీ నుంచి జాబు వచ్చి చాలా కాలమైంది. నిన్ను, కోడలని, శ్రీనివాసుని చూడాలని అమ్మ చాలా ఆరాట పడుతోంది.

మీకు సెలవలు దొరికి పల్లెటూరికి రావడం కష్టమయినప్పటికి వీలు చూసుకుని మనవడిని తీసుకు రండి. రిటైరయినప్పట్నించి నాకు బొత్తిగా తోచడం లేదు. అమ్మకీ మధ్యన తరచుగా జ్వరం వస్తోంది. ఇద్దరికీ మిమ్మల్ని చూడాలని, మనవడితో ఆడు కోవాలని తహతహగా ఉంది. అమ్మ ఆరోగ్యం కుదట పడితే మేమైనా బయలుదేరి వద్దామని ఉంది. కాని డాక్టరుకి చూపిస్తున్నా అమ్మకి జ్వరం తగ్గడం లేదు. మీ క్షేమ సమాచారాలతో జవాబు వ్రాసి ఎప్పుడు వస్తున్నారో తెలియపర్చండి. కోడలికి ఆశీస్సులు. శ్రీనివాసుకి ముద్దులు.

ఇట్లు
మీనాన్న
**సీతారామయ్య**

తండ్రి ఆవేదనతో వ్రాసిన ఉత్తరం చదివిన రాధాక్రిష్ణ మనసు బాధతో మూలిగింది.

"చూసావా హైమ! నాన్నగారు ఎలా వ్రాసారో, మొన్న పండుగకి వెళదామని ఎంత ప్రయత్నం చేసాం, నాకు సెలవు దొరికింది, కాని నీకు దొరకలేదు. వాళ్లకేమో మనం వాళ్ళని పట్టించుకోలేదనిపిస్తుందన డానికి మనమేం సుఖపడిపోతున్నాం చెప్పు ఇక్కడ!"

"అబ్బబ్బ మీరు ప్రతీది భూతద్దంలోంచి చూస్తారు! వాళ్లు రమ్మనమని వ్రాసారు. వాసుకి వచ్చే నెలలో దసరా సెలవలు! అప్పుడు ప్లాను చేసుకుని వెళదాం లెండి!" హైమ తేలిగ్గా అంది.

"అమ్మకు బాలేదని వ్రాసారుగా? నేను రేపాది వారం నాడు వెళ్లి చూసి వస్తాను, ముందు?"

"అలాగేలెండి!"

ООО

సీతారామయ్యకు, లక్ష్మీదేవికి ఒక్కడే కొడుకు రాధాక్రిష్ణ. ఆయన స్కూలు మేష్టారు కావడంతో కొడుకుని చాలా క్రమశిక్షణగా పెంచాడు. పై చదువులకి కాకినాడ హాస్టలులో పెట్టి మరీ చదివించాడు. హైదరాబాదులో రాధాక్రిష్ణకు మంచి ఉద్యోగం రావడం, వెంటనే మంచి సంబంధం కుదిరి పెళ్లి కావడంతో ఆ దంపతుల ఆనందానికి అంతే లేదు. హైమావతికి హైదరాబాదులో టెలిఫోను ఆపరేటరుగా ఉద్యోగంలో చేరడంతో ఏడాదికి పది రోజులు కూడా అత్తవారింట్లో గడపడం ఆమెకు కుదరడం లేదు.

'మీరే వచ్చి మా దగ్గరుంటే మాకు నిశ్చింతగా ఉంటుందని' రాధాక్రిష్ణ ఎంతచెప్పినా వాళ్ళు ఆ పల్లెటూరిని వదిలి సిటీ రాలేకపోయారు.

పెళ్లయిన కొద్దిరోజులకి వాళ్లకాపురం ఎలా ఉందో అని చూడటానికి వెళ్లిన సీతారామయ్యకి, లక్ష్మీదేవికి నిరాశే మిగిలింది. ఇద్దరు పొద్దునే బాక్సుల్లో అన్నాలు పెట్టుకుని వెళ్లిపోతే, మళ్లీ రాత్రే రావడం అవుతోంది. పైగా ఉన్నది సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్! అంతా ఇరుగ్గా అనిపించింది ఇద్దరికి!

పల్లెటూళ్లో ఉన్న తన ఇల్లు గుర్తుకు వచ్చింది. సీతారామయ్య పేరుకు పెంకుటిల్లే అయినా చుట్టూ విశాలమైన స్థలం! ముందు, వెనుకా బోలెడు పచ్చని మొక్కలు, ఏపుగా ఎదిగిన చెట్లు! పది మంది వచ్చి పోతూ ఉంటే కళకళలాడుతూ ఉంటోంది. పాలు పోస్తూ పలకరించే కోటిగాడు, రోజు బట్టలు తెచ్చే చాకలి, మాస్టారు, మాస్టారు అంటూ పొద్దున, సాయంత్రం ఇంటికి వచ్చే స్టూడెంట్లు, మూడుపూట్ల ఇంట్లో పనిచేస్తూ వెనక వెనకే తిరిగే పనిమనిషి రత్తాలు, వాలు కుర్చీలో కూర్చుంటే పక్కన అరుగు మీద కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడే పక్కింటి చంద్రారెడ్డి, ఎదురింటి నాయుడుగారు అస్సలు రోజు ఎలా గడిచి పోతుందో తెలియదు అక్కడ!

ఎండాకాలంలో రాత్రి మడత మంచం వేసుకుని బయటపడుకుంటే చల్లగా వీచే గాలి, వెన్నెల కురిపించే చంద్రుడు, పక్కన లక్ష్మీదేవి కూర్చుని తాంబూలం అందిస్తుంటే జీవితం ఒక అందమైన అనుభవంలా క్షణంలో సాగిపోతుండేది. అదే ఇక్కడ సిటీ లైఫ్, ఈ ఉరుకులు పరుగులు ఆయనకు అస్సలు మింగుడు పడలేదు. ఓ రోజు ఉండపట్టలేక కొడుకుతో అదే అనేసాడాయన!

"రాధాక్రిష్ణ! సిటీలో ఎన్ని సౌకర్యాలున్నా, ఏదో తెలియని వెలితి ఉందిరా ఇక్కడి జీవితాలలో, సౌఖ్యం ఉన్నా ఆనందం లేదురా ఇక్కడ అని నవ్వేసాడు రాధాక్రిష్ణ!.

"నాన్నగారు! మనిషి శక్తి మించి ఎదుగుదామను కున్నప్పుడు క్షణం తీరిక ఉండదు. ఇక్కడ జరుగు తున్నది అదే!'

"అలా అంటే ఎలారా క్రిష్ణా! డబ్బే జీవితమా చెప్పు?" ఆవేదనతో అన్నారాయన!

"డబ్బే జీవితం కాదు, ఒప్పుకుంటాను! కాని ఉన్న దాంతో తృప్తిపడి ఎలాగోలా జీవితాన్ని గడిపేయాలన్న ఆలోచన మా జనరేషన్లో మాకు తెలియకుండానే తుడిచి పెట్టుకుపోయింది. సిటీ మధ్యలో ఇంటి అద్దెలు విపరీతంగా ఉంటాయి! అందుకే ఊరి చివర అద్దెకు తీసుకున్నా. రెండు మూడు బస్సులు మారి ఇల్లు చేరే టప్పటికీ మీకు మాట్లాడుకోవడానికి కూడా ఓపికలుం డడం లేదు. చికాకులు పడడం తప్ప! మేం యాంత్రి కంగా తయారవ్వడం మాకు తెలియక కాదు, కాని మా భవి ష్యత్తు, మాకు పుట్టబోయే పిల్లల భవిష్యత్తు కోసం మేమీ త్యాగాలు చేయక తప్పదు. అందరితో పాటు పరుగు పెట్టకపోతే మేమే వెనకపడిపోతాము!

"నువ్వు ఊరికే సమర్థించుకుంటున్నావు కాని, నీ రూటులో ఏదో లోపం ఉందిరా!"

"లేదు నాన్నగారు, పోనీ ఒక్కటి చెప్పండి! మేం ఈ ఉద్యోగాలు వదిలేసి మీరు చెప్పిన ప్రశాంతమైన జీవితంలోకి వచ్చేమే అనుకోండి, తిండికి గడిచి పోతోంది. కాదనను, కాని మాకు భవిష్యత్తు ఏముం టుంది, మా పిల్లలు అలాగే పల్లెటూళ్లో మట్టి పిసు క్కుంటూ బతకాల్సిందే?" అంతే కాదు? "అయినా ఇక్కడే పుట్టి పెరిగారు, అయినా మరి నన్ను పై చదువులు బాగా చదివించారు. నేను అంచెలంచెలుగా ఎదిగి ఇక్కడ స్థిరపడ్డాను. రేపు మా పిల్లలు ఎక్కడో ఏ అమెరికాల్లోనో స్థిరపడతారు. అంతే ఇది జనరేషను గ్యాపు!" తేలిగ్గా అన్నాడు రాధాక్రిష్ణ!

'మన మూలాలు భూమిలోనే, ఇక్కడే ఉన్నాయిట! అది మనం ఎప్పుడూ మర్చిపోకూడదు?' గంభీరంగా అన్నారాయన!

○○○

రాధాక్రిష్ణకు కొడుకు పుట్టినప్పుడు పెద్దవాళ్లిద్దరు ఆనందంలో పొంగిపోయారు. సెలవు పెట్టి మనవడిని చూడటానికి వెళ్లారు. నాలుగు రోజులు సంతోషంగా గడిపి బరువెక్కిన మనసులతో ఊరికి తిరిగి వచ్చారు. మనవడి రూపం కళ్లల్లో కదలాడుతుండగా!

వాసుని క్రెష్లో అట్టేపెట్టి ఉద్యోగానికి వెళుతుంటే హైమ గిలగిల లాడిపోయింది. నాకు అమ్మా, నాన్న ఎవరు లేరు? మీకు ఉన్నా వాళ్లు పల్లెటూరు వదిలి పెట్టి రానేరారు! మన బలవంతం మీద వచ్చినా నాలుగు రోజులుండేటప్పటికీ పంజరంలో పెట్టిన చిలకల్లా గిలగిలలాడతారు. ఈ పసివాడ్ని వదిలిపెట్టి ఉద్యోగానికి వెళ్లలేకపోతున్నాను?" అంటూ ఏడ్చేసింది రాధాకృష్ణను చుట్టుకుని!

భార్య ఆవేదన అర్థం అయింది కాని పరిష్కారం తెలియలేదు అతనికి! అలాగే ఆలోచిస్తూ ఉండి పోయాడు మౌనంగా!

"హైమ! లాంగ్‌లీవ్ పెట్టెయ్ కొన్నాళ్లు!" అన్నాడు ఫైనల్‌గా!

"ఇల్లు మొదలు పెట్టుకున్నాం. కనీసం పది లక్షలన్నా కావాలి! ఇప్పుడు నేను సెలవు పెట్టి ఇంట్లో కూర్చుంటే ఒక్క జీతంతో ఎలా నడుస్తుంది?" కళ్లు తుడుచుకుంటూ అంది హైమ!

"మనం ఎంత కష్టపడ్డా! పిల్లాడి కోసమే కదా! ఒక పోర్షను అద్దెకు ఇస్తే నెమ్మదిగా లోన్లన్నీ తీర్చేయచ్చు! వాడి పేర డబ్బు దాయచ్చు! అంటూ తనే సర్దుకుంది కాసేపటికి!

రెండు మూడు ఏళ్లు క్రమం తప్పకుండా సెలవలకి ఊరు వెళ్లేవాళ్లు వాసును తీసుకుని! తరువాత ఏదో ఒక బాధ్యత అడ్డుపడుతుండడంతో నెమ్మదిగా రాధాక్రిష్ణ వెళ్లి వస్తున్నాడు. తల్లితండ్రులను చూసి! ఫోను అందు బాటులోకి రావడంతో మధ్యమధ్యలో ఫోను కబుర్లు అన్ని తెలుస్తూనే ఉన్నాయి.

"వాసుని సెలవల్లో ఒక నెలరోజులయినా పం పండి! మనవడు నట్టింట్లో తిరుగుతుంటే మాకు తృప్తిగా వుంటుంది" పార్వతి కొడుకుని పదేపదే అడిగేది!

"అసలు వీలు పడదు అత్తయ్యగారు! వాడికి సమ్మర్ కోచింగులు, సాయంత్రం స్విమ్మింగ్ నేర్పిస్తున్నాం. సమాధానం హైమ నుండి వచ్చేది! అన్ని రోజులు మన చేతుల్లో ఉండవు! లక్ష్మీదేవికి తరచుగా ఏదో ఒక రోగం – బాధపెడుతోంది! మనిషి పూర్తిగా క్షీణించి పోతోంది! రాధాక్రిష్ణ బయలుదేరి వచ్చి భోరుమన్నాడు. సన్నగా, రివటలా అయిన తల్లిని చూసి!

"అమ్మా! వెంటనే బయలుదేరండి! అక్కడ మంచి

డాక్టరుకి చూపిస్తాను! అన్నాడు రాధాకృష్ణ!

"నాకేం రోగం లేదురా! రాయిలా ఉన్నాను! ఇలా వెళ్లిపోయే రోజులు కాని వచ్చే రోజులు కావుగా! పిచ్చి నాన్నా! ఊరికే కంగారుపడకు!"

కొడుకు రాకతో ఇద్దరికి వేయి ఏనుగుల బలం వచ్చినట్టుంది! పాత రోజులు తలుచుకుంటూ నాలుగు రోజులు కబుర్లు చెప్పుకున్నారు. పనివాళ్లని పెట్టించి రాధాకృష్ణకు వళ్లంతా నలుగు పెట్టించి స్నానం చేయించి, ఇష్టమైన పిండి వంటలు చేయించి సంబర పడిపోయిందావిడ!

ఎంత బలవంతం పెట్టినా ఇద్దరిని ఈ ఊరి నుంచి తీసుకెళ్లలేకపోయాడు తను!

"క్రిష్ణా! డాక్టర్లు మందు పోస్తారు, వళ్లంతా తూట్లు పొడుస్తారు! కాని ఊపిరి పోయలేరు! నేను పుట్టినిల్లు, మెట్టినిల్లు రెండు ఈ ఊరే! ఇక్కడే పుట్టాను, ఇక్కడే నేను రాలిపోవాలి! అక్కడికి వచ్చి నేను ఎవరికి ఇబ్బంది పెట్టలేను! కాని నాదొక కోరిక! వాసుని చూడాలని ఉంది! ఒక్కసారి తీసుకురా!" అంటూ బలహీనంగా ఉన్న చేతిలో చేయి వేయించుకుంది పార్వతి. కొడుకుతో!

కనుమరుగైపోతున్న కొడుకు మసకబారిన చూపులతో జారిపోతున్న కన్నీళ్లలో, బరువెక్కిన గుండెతో అలాగే చూస్తుండిపోయింది లక్ష్మీదేవి! భార్యను నెమ్మదిగా తీసుకెళ్లి గదిలో పడుకో పెట్టారాయన! మళ్లీ వంటరితనం చుట్టుముట్టింది ఇద్దరిని! వృద్ధాప్యం తోడు కోరుకుంటోంది. మంచి మాటల్ని కోరుకుంటుంది. మమతల్ని నెమరువేసుకుంటుంది. మమకారాన్ని మిగుల్చుకుంటుంది. పుట్టిన ఊరును, పెంచుకున్న బంధాలని, సొంతింటిని వదిలి ఎక్కడికి పోనంటుంది. తెల్లవారి పార్వతి ఇక కళ్లు తెరవలేదు! అలాగే నిద్రలో శాశ్వతంగా అందరిని వదిలి నిశ్శబ్దంగా వెళ్లిపోయింది.

ООО

వాసు ఇంజనీరింగు కాలేజిలో ఫస్టుగా నిలిచిన రోజు రాధాకృష్ణ ఆనందంలో తబ్బిబ్బయి పోయాడు. అందరికీ స్వీట్లు పంచి పండుగలా సెలబ్రేట్ చేసాడు. చాలా రోజుల తర్వాత అతనికి తన తండ్రి గుర్తుకు వచ్చాడు.

తను ఎమ్మెస్సి పాసయిన రోజు తండ్రి ఎంత గర్వపడ్డాడో... తను వంగి కాళ్లకు నమస్కరించగానే దగ్గరకు తీసుకుని ఎంత బలంగా అభిమానంగా కౌగిలించుకున్నారో, ఆ అపురూపమైన క్షణం రాధాక్రిష్ణ కళ్ల ముందు తిరిగి అతని కళ్లలో నీళ్లు వచ్చాయి. ఆ క్షణాల్ని హైమతో పంచుకుంటూ.

"నాన్నగారు అమ్మ పోయాక బాగా కృంగిపోయారు హైమ! ఎంత బలవంతం చేసినా ఒక్కరే అక్కడ ఉంటున్నారు, ఏమిటో వాళ్ల చాదస్తం!" అన్నాడు.

"మనమేం చేయలేము, వాళ్లు ఇక్కడికి వచ్చి ఎడ్జెస్ట్ అవ్వలేరు. మనమే నాలుగు రోజులు చూడటానికి తప్ప ఉండటానికి వెళ్లలేము! ఇంకా నయం, మీ కాంత మత్తయ్య వండి పెడుతోంది. కాబట్టి ఆయనకి కాలం గడిచిపోతోంది? లేకపోతే పెద్దాయన్ని అక్కడ వదిలి పెట్టి మనకెంత బాధ!" చిన్నగా అంది హైమ.

## కాలచక్రం

**బా**ణం దెబ్బ
హంస విలవిల
రక్షించే చేతులు!
ఒక వృద్ధుడు వణికి
ఒక రోగి మూలిగి
ఒక శవయాత్ర
ఒక అంతర్మథనం
దుఃఖం వదిలేదెలా
ఎంత వేదన
ఎంత శోధన
బోధి వృక్షముంది.

О О О

బులెట్ దెబ్బ
వలస పక్షి గిలగిల
భక్షించే చేతులు!
ఒక వృద్ధుడు ఒంగి
ఒక రోగి కృంగి
ఒక శవయాత్ర
ఒకటే ఆదుర్దా
ధనం దక్కేదెలా
ఎంత ఆశ
ఎంత ఆత్రం
బోన్సాయ్ వృక్షముంది

-శంకర

"మీకు గుర్తుందా! మన పెళ్లయిన కొత్తల్లో అత్తయ్య గారు బాత్‌రూమ్‌కి వెళ్లడానికి చాలా ఇబ్బంది పడే వారు. నాకు ముందు ఎందుకో అస్సలు అర్థమయ్యేది కాదు! తర్వాత ఎప్పుడో చెప్పారు ప్రాబ్లం ఏమిటో! "పక్కనే తినడం, ఆ పక్కనే లెట్రినుకు వెళ్లడం నాకు చాలా అసహ్యంగా ఉంది. మా ఇంట్లో దొడ్లు వంటి ల్లుకు, పూజ గదికి దూరంగా మూలగా వుంటాయి!" అంటూ! మనకెంత కామన్ అయిన ఎటాచ్డ్ టాయి లెట్లు వాళ్లకి ఎంతో అసహజంగా అనిపించాయి!

రాధాకృష్ణ కళ్లల్లో తల్లిరూపం మెరిసింది! దూర తీరాలకి వెళ్లిపోయిన తల్లిని చూడాలని, అమ్మచేత పీట వేయించుకుని అరిటాకులో వేడిగా, కమ్మగా వండి వడ్డించే అప్యాయతా అనురాగాలని మళ్లీ అనుభవించా లన్న కోరిక కలిగింది!

వాసుకి అమెరికాలో ఉద్యోగం వచ్చింది! రాధా కృష్ణకి కొడుకు ఎదుగుదల ఆనందాన్నిచ్చినా మనస్సు లోపలి పొరల్లో ఏదో వెల్తి! ఏదో బాధ! తన ప్రాణాల్ని దూరం చేసుకుంటున్నా వెర్రి బాధ!

"ఏమిటీ చిన్న పిల్లాడిలా! అందరూ అమెరికా లంటూ వెళ్లిపోతుంటే, వాడ్ని ఇంట్లో పెట్టి – బంధి స్తామా ఏమిటీ? వాడు రెక్కలు వచ్చిన పక్షి! వాడిని స్వేచ్ఛగా ఎగరనియ్యాలి? అంతేకాని, అయినా మీరు మీ ఊరిని, మీ వాళ్లని వదిలి ఇక్కడికి చేరలేదు!"

హైమ మాటలు అతని గుండెల్ని సూటిగా తాకాయి! మరేం మాట్లాడలేకపోయాడు. వాసు వెళ్లిపోయాడు!

వాసు వెళ్లి ఏడాది దాటుతున్నా రాధాక్రిష్ణ, హైమ అతని లోటును అధిగమించలేకపోతున్నారు. వాడు గుర్తుకు వచ్చినప్పుడల్లా రాధాక్రిష్ణ మరీ డీలా పడు తున్నాడు. వాసును తలుచుకోగానే తల్లితండ్రి రూపాలు కళ్లముందు తిరుగుతున్నాయి. వాళ్లు పడ్డ బాధ అతనికి ఇప్పుడు అనుభవంలోకి వస్తోంది. ఈ డబ్బు, హోదా, ఇళ్లు ఇవేవి అతనికి ఆనందాన్ని ఇవ్వడం లేదు. బాధ లను పెంచుకోవడంలో ఉన్న ఆనందం వాటిని నిలుపు కోవాల్సిన బాధ్యత అతనికి అనుభవంలోకి వచ్చింది.

సిటీ లైఫ్, రొటీన్ ఫార్మాలిటీస్, కృత్రిమ నవ్వులు, చాటు ఏడుపులు, డర్టీ టివి ఛానెల్స్, అర్థం లేని పరుగులు – రాధాకృష్ణను విసిగించేస్తున్నాయి!

డియర్ వాసు!

నా మెయిల్ ఇవాళ నీకో సర్‌ప్రైజ్! ఫోన్లో మాట్లా డుకోవచ్చుగా అనుకోకు! ఉత్తరాలు అక్షరాల రూపంలో మనం పంచే అనురాగాలు ప్రతీకలు! ఫోను మాటలు గాలిలో కలిసిపోతాయి! మరో విషయం! మై హౌస్ ఎడ్రస్ ఈస్ చేంజ్‌డ్ నౌ! నోట్ చేసుకో! రాధాకృష్ణ సన్నాఫ్ శ్రీ సీతారామయ్య, రిటైర్డ్ టీచర్, కిర్లంపూడి, తూర్పు గోదావరి జిల్లా! మన ఇల్లు అద్దెకిచ్చేసి ముఖ్యమైన సామాను తీసుకుని నేను, అమ్మ తాతగారి దగ్గరకు వచ్చేసాము. ఇక నా బాలన్స్ లైఫ్ ఇక్కడే గడపాలని డిసైడ్ చేసుకున్నాను.

వాసు! తాతగారు ఆనందంలో తబ్బిబ్బు అయ్యారు! ఇల్లంతా మరమ్మతులు చేయించారు. కనుచూపు మేర పచ్చదనం! చల్లటి ఏటిగాలి, కల్మషం లేని చిరునవ్వులు అలగా జనం వంగి వంగి సలాములు చేస్తుంటే వద్దం టున్నా చుట్టుకున్న పెద్దరికం – ఇవన్నీ నన్నిక్కడే సెటిల్ అవ్వమంటున్నాయి. తాతగారి దగ్గర పుట్టి పెరిగిన నేను, మళ్లీ నేను తాతనయ్యే స్టేజిలో ఆయన నీడలో చేరడం, ఆయనతో ఉండడం నాకెంత సంతృప్తిని స్తోందో నేను మాటల్లో వ్రాయలేను.

వాసు! నా బాల్యం అందమైంది! నా వృద్ధాప్యాన్ని అర్థవంతమైనదిగా పూర్తిచేయాలన్నదిప్పుడు నా ఆకాంక్ష! నాకున్న డబ్బుతో, పలుకుబడితో ఊరికి, నాకు జన్మనిచ్చిన ఈ భూమికి ఏదయినా మంచి చేయాలన్నది నా కోరిక! నేను చదివిన స్కూలు బాగా పాడయిపోయింది. ప్రస్తుతం దాన్ని పడగొట్టించి కట్టిస్తున్నాను! మా అమ్మ పేరున అది ప్రారంభించే రోజు నువ్వు ఇక్కడే ఉండాలి!

వాసు! బై చెప్పే ముందు ఒక్కమాట! మై డెసిషన్ ఈస్ టూ లేట్! ఎందుకంటే నన్ను ప్రాణానికి, ప్రాణంగా ప్రేమించిన అమ్మ, నా కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన అమ్మ మరి లేదు, రాదు! బట్ నువ్వు అటువంటి పొరపాటు చేయకూడదు! నీ నాలెడ్జ్ పెంచుకో! నీ కిష్టమైన రంగంలో అపారకృషి చేయి! కాని విజ్ఞానానికి ఎండ్ ఉండదు అలాగే ఆశకు అంతు ఉండదు! నేను చేసిన పొరపాటు నువ్వు చేయకుండా టూ లేట్ కాకుండా బ్యాక్ హోమ్ సూన్! అదే నీ తండ్రి కోరిక!

ప్రేమతో,

నాన్న

"ఐ లవ్ యు! ఐలవ్ మమ్మీ!" "తప్పకుండా డాడీ! మీరు చాచిన చేతులు అలవకుండా మిమ్మల్ని త్వరలో చేరుకుంటాను!" వాసు కళ్లలో నీళ్లు! జలపాతం ఎంత ఎత్తున్నా చేరాల్సింది భూమి కౌగిలికే కదా! ■